క్లుప్తంగా

డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.12.50 కోట్లు



డబుల్ రోడ్డుగా మారనున్న పసుపల, బనగానపల్లె రహదారి

బనగానపల్లె: బనగానపల్లె ఆర్అండ్బీ సెక్షన్ పరిధిలోని పసుపల, బనగానపల్లె ఏడు కిలో మీటర్ల డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ.12.50 కోట్లు నిధులు మంజూరైనట్లు ఆర్ అండ్బీ ఏఈ హుస్సేన్ తెలిపారు. త్వరలో టెండర్లు పూర్తవుతాయని, వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్య ఉండదన్నారు.

గ్రంథ పాఠక సేవను సద్వినియోగం చేసుకోండి

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రకృతిపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథ పాఠక సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనాథపిల్లలు, ఆర్థికస్తోమత లేని పేద పిల్లల చదువుకు గ్రంథ పాఠక సేవ ద్వారా ఆర్థిక సాయమందిస్తున్నామన్నారు. మండలంలోని గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు వినియోగించుకుని, ఉన్నత చదువులు చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు.

భవన మరమ్మతులకు రూ.9.70లక్షలు

బనగానపల్లెరూరల్: మండల కేంద్రంలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయ భవన మరమ్మతులకు రూ.9.70 లక్షలు జెడ్పీ నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ మంగళవారం తెలిపారు. ఈ భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని సంబంధిత అధికారులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నిధులను మంజూరు చేయించారన్నారు. కార్యాలయానికి ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, నీటి సౌకర్యంతో పాటు పెయింటింగ్ పనులు చేపట్టనున్నట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. మరమ్మతులు పూర్తి అయ్యేంత వరకు ఈ కార్యాలయాన్ని స్థానిక ఇండోర్ స్టేడియం వెనుక ఉన్న భవనంలోకి మార్పు చేశారు.

గైనకాలజిస్ట్‌గా డాక్టర్ మేఘన

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజిస్ట్‌గా డాక్టర్ మేఘన విధుల్లో చేరినట్లు సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ శ్వేతశాలిని ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లారన్నారు. ఆమె స్థానంలో కోవెలకుంట్లకు చెందిన మేఘనను నియమించినట్లు పేర్కొన్నారు. అలాగే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి నుంచి హెడ్‌నర్స్‌గా లక్ష్మిని ఇక్కడికి బదిలీ చేశారన్నారు. సీహెచ్‌సీలో ఐదుగురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురు ఉన్నారని, మరో డాక్టర్ పోస్టు భర్తీ చేయాల్సి ఉందని ఆయన వివరించారు.

పిల్లలు అంగన్‌వాడీలో ఉండేలా చర్యలు తీసుకోవాలి

బేతంచెర్ల: పట్టణం గ్రామీణ ప్రాంతాలలోని 3–5 సంవత్సరాలలోపు చిన్నారులను వారి తల్లిదండ్రుల అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు శోభారాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న, ఎంఈఓ సోమశేఖర్‌కు వారు వినతి పత్రం అందజేశారు. కొందరు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం పిల్లల తల్లిదండ్రులను మాయ మాటలతో వారి స్కూల్లో చేర్పించేలా మభ్యపెడుతున్నారని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాంటి ప్రైవేటు పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, శ్రీదేవి, రాధమ్మ, రమణమ్మ, లక్ష్మీదేవి, సులోచన, సుబ్బలక్ష్మి, వరాలు పాల్గొన్నారు.

గర్భిణిలకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె: మండలంలోని పసుపల అంగన్‌వాడీ సెంటర్–2లో గర్భిణిలకు వైఎస్సార్ బాల సంజీవని పథకం కింద పౌష్టికాహారాన్ని మంగళవారం బనగానపల్లె మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణిలు ప్రసవానికి ముందే రక్తహీనత గురించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఓ సంధ్య, ఏఎన్‌ఎం మహేశ్వరి, అంగన్‌వాడీ వర్కర్ నాగలక్ష్మీ ఆశా వర్కర్ మౌలానమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- పార్టీలకు అతీతంగా అర్హులకు ప్రభుత్వ పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

సంజామల: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమానంగా ప్రాధాన్యతిస్తుందని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం కృషి చేస్తున్నారన్నారు. మండల కేంద్రం సంజామలలో రెండవరోజు మంగళవారం ఎమ్మెల్యే కాటసాని గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కర్నూల్ కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఎంపీడీవో నాగ కుమార్, తహసీల్దార్ మల్లికార్జున రావు తదితరులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు సంక్షేమ పథకాలు అందాయా.. లేదా అని లబ్ధిదారులను అడగ్గా ప్రతిఒక్కరూ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యేకు తెలిపారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని పేదలు వివరాలు అందజేస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకటరామిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు నాగిరెడ్డి ప్రతాపరెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ, సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని

గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా సంజామలలో గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముందుగా అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ. 22 లక్షలతో నిర్మించిన నూతన డిజిటల్ లైబ్రరీ, రూ. 20 లక్షలతో సీసీ రోడ్లను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతిక కారణాల మూలంగా సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులకు వర్తింపజేసేందుకు, ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వలంటీర్ల సేవలను ప్రతిఒక్కరూ అభినందిస్తుంటే జనసేన అధ్యక్షుడు మాత్రం విమర్శలు గుప్పించడం సిగ్గుచేటన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్యాపిలి: స్థానిక ఆంజనేయ స్వామి గుడి వీధిలో కొత్తగా వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, సర్పంచ్ లక్ష్మిదేవి మాట్లాడుతూ పట్టణంలోని పలు వీధుల్లో కొత్తగా సీసీ రోడ్లు వేస్తున్నామని తెలిపారు. ఆంజనేయ స్వామి గుడి వీధిలో వేస్తున్న రోడ్డుకు రూ. 10 లక్షలు మండల నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు బోరెడ్డి కృష్ణారెడ్డి, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న జెడ్పీటీసీ, సర్పంచ్

ఆర్టీసీ లాభాలబాటలో నడిపించేందుకు కృషి

కోవెలకుంట్ల: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను లాభాల బాటలో పయనింపచేసేందుకు కృషి చేస్తున్నట్లు రీజనల్ మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోను ఆయన తనిఖీ చేశారు. గ్యారేజీని పరిశీలించి బస్సుల కండిషన్‌ను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్‌ను తనిఖీ చేసి వసతుల కల్పనై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు అనుగుణంగా ఆయా రూట్లలో బస్సులు నడుపుతున్నామన్నారు. ఆర్టీసీని ఆదరించాలని, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ తిరుపతయ్య, ఎస్‌టీఐ కిషోర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎన్‌ఎంయూ జిల్లా సెక్రటరీ శివరాం, డిపో అధ్యక్షుడు నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లెరూరల్: బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ వర్కర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రోజారాణి మంగళవారం తెలిపారు. బనగానపల్లె మండలం పాతపాడు అంగన్‌వాడీ కేంద్రం–2 ఓసీ, అవుకు మండలం లింగంబోడు అంగన్‌వాడీ సెంటర్ ఓసీ, కలుగోట్ల అంగన్‌వాడీ సెంటర్–3 ఓసీ ఈడబ్ల్యూఎస్, ఇస్రానాయక్‌తాండ మినీ అంగన్‌వాడీ సెంటర్ ఎస్టీకి కేటాయించినట్లు తెలిపారు. అదే విధంగా ఆయాల పోస్టులు హనుమంతుగుండం అంగన్‌వాడీ సెంటర్ ఓసీ, బెలుం అంగన్‌వాడీ సెంటర్–3 ఎస్సీ, పేరుసో ము ల అంగన్‌వాడీ సెంటర్–3 ఓసీ, కొండమనా యునిపల్లి అంగన్‌వాడీసెంటర్ బీసీ–బీకి కేటాయించిన ట్లు చెప్పారు. పదవ తరగతి ఉత్తీర్ణత కలిగి వయసు 21 నుంచి 35 ఏళ్లలోపు స్థానికులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వివాహిత మహిళా అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ సాయంత్రంలోపు అన్ని వివరాలతో కూడిన దరఖాస్తులను స్థానిక సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని సీడీపీఓ తెలిపారు.

నేడు అఖిలపక్ష నాయకులతో సమావేశం

డోన్ టౌన్ : ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల నమోదు, సర్వే అంశాలపై బుధవారం స్థానిక రోడ్లు భవనాల శాఖ నూతన అతిథి గృహంలో అఖిల పక్ష రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి నిర్వహించే ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజనుకు ముందు ఈ నెల 21వ తేదీ నుంచి ఇంటింటికి తిరిగే నిర్వహించే సర్వే షెడ్యూల్ గురించి వివరించనున్నట్లు ఆర్డీఓ తెలిపారు.

నాటుసారా విక్రేతలు అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండాలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. పీతావత్ మనీబాయి, నేనావత్ లక్ష్మిబాయి, భాస్కర్ నాయక్, రమావత్ సుక్కు నాయక్, భూలక్ష్మి, లక్ష్మిబాయిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 60 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైకు చోరీ

డోన్ టౌన్ : పట్టణంలోని కర్నూలు రైల్వే గేట్ల సమీపంలో (పాత మహాలక్ష్మి ఆసుపత్రి)వద్ద పార్కు చేసిన బైకు చోరీకి గురైనట్లు బాధితుడు వెంకటేష్ తెలిపారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బాధితుడు ఈ నెల 9న పట్టణానికి వచ్చిన సమయంలో తన హోండా షైన్ ఏపీ.21బిడబ్ల్యూ 6454 బైకు చోరీకి గురైనట్లు మంగళవారం పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

దొంగ అనే అనుమానంతో చితక బాదిన ప్రజలు

డోన్ టౌన్: పట్టణంలోని కేవీఎస్ కాలనీలో గుర్తు తెలియని మత స్థిమితంలేని వ్యక్తిని ఆ కాలనీ వాసులు దొంగగా భావించి కరెంటు స్తంభానికి కట్టేసి చితక బాదిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి కాలనీలో సంచరిస్తున్నట్లు సమాచారంతో అతన్ని పట్టుకునేందుకు స్థానికులు ప్రయత్నించారు. అయితే భయపడిన మతిస్థిమితంలేని వ్యక్తి పరుగెత్తడంతో వెంబడించారు. అతను ఓ ఇంటిలోకి దూరిపై అంతస్తు నుంచి కిందకు దూకగా గాయాలు అయ్యాయి. గాయపడిన వ్యక్తిని పట్టుకొని కరెంటు స్తంభానికి కట్టేసి చితకబాది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆరాతీసి నిందితుడు మతిస్థిమితం సరిగా లేని వ్యక్తిగా నిర్ధారించి చికిత్స కోసం ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



కోవెలకుంట్లలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చైర్మన్ రాజేష్



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న శ్రీరాములు, రేగటి రాజశేఖర్‌రెడ్డి



సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న

కోవెలకుంట్ల: సాంకేతిక కారణాల మూలంగా సంక్షేమ పథకాలు అందని పేదలు గుర్తించడంతోపాటు ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలు ఉచితంగా అందజేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 2వ గ్రామ సచివాలయ ఆవరణలో జగనన్న సురక్ష సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి చైర్‌పర్సన్‌తోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు. తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ రాధిక ఆధ్వర్యంలో సచివాలయ పరిధిలోని ఆయా కాలనీల్లోని అన్ని అర్హతలు ఉండి నాలుగేళ్లకాలంలో ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాలు వర్తించని లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం ఆయా కాలనీకు చెందిన పలువురికి కుల, ఆదాయ, పుట్టినతేదీ సర్టిఫికెట్లు, వన్‌బీ అడంగళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ గోపీనాథ్, పశువైద్యాధికారి కృష్ణకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, ఏపీఎం గురుస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల గ్రామ సచివాలయం–1 పరిధిలో మంగళవారం తహసీల్దార్ దోనీ ఆల్ ఫ్రెడ్, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు 844 మందికి వివిధ ధ్రువీకరణ సర్టిఫికెట్లను లబ్ధిదారులకు వారు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, జెసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి, పశువైద్యాధికారిణి పద్మావతి, నాయకులు బీగాల వెంకటసుబ్బయ్య, ఎంకె నాయుడు పాల్గొన్నారు.


ప్యాపిలి: మండల పరిధిలోని మునిమడుగు, రాచర్లలో మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలకృష్ణుడు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగిల్ విండో అధ్యక్షుడు అలేబాదు బాలయ్య, రాచర్ల సర్పంచ్ ఆసియాబీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీటీసీ చెన్నమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు దివాకర్ రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని ఆల్వకొండ గ్రామ సచివాలయ ఆవరణంలో మంగళవారం ఎంపీడీఓ నాగ కుమార్, తహసిల్దార్ మల్లికార్జున రావు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆల్వకొండ సర్పంచ్ అందనం శ్రుతి, రెడ్డిపల్లే సర్పంచ్ పద్మావతి వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు ఎస్సీ బాబు, నరసింహారెడ్డితో కలిసి వారు 167 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.

అవుకు: మండల పరిధిలోని అన్నవరం, రామాపురం –2 గ్రామ సచివాలయాల్లో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులు, ఇంచార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నవరంలో 183 మందికి, రామాపురం–2లో 150 మందికి ధ్రువీకరణ పత్రాలను అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎల్ఆర్ డీటీ శ్రీనివాసులు, ఈఓ అశ్విన్ కుమార్, ఎంఈఓ–2 వెంకటేశ్వర రెడ్డి, ఏపీఎం విజయగోపాల్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శివమ్మ, ఎంపీటీసీలు గోపవరం గోపాల్ రెడ్డి, పేరం వెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు కొమ్ము చౌడమ్మ, తలారి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

డోన్ : పట్టణ పరిధిలోని నెహ్రూనగర్‌లో కౌన్సిలరు మిట్టా ఉమా మహేశ్వరి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలను కమిషనర్ వెంకటామిరెడ్డి, వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్‌తో కలిసి చైర్మన్ సప్తశైల రాజేష్ అందజేశారు.

డోన్ టౌన్ : సాంకేతిక సమస్యలతో ప్రభుత్వ పథకాలు అందని అర్హులైన పేదలను గుర్తించి న్యాయం చేయడంతోపాటు ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందజేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటనాయునిపల్లె, యర్రగుంట్ల గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు వారు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, సర్పంచ్‌లు శీలం చంద్రశేఖర్, గిడ్డయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, రాణా ప్రతాప్, నాగిరెడ్డి, రాజు, మనోహర్, వెంకటరాముడు, బాలమారెన్న, రాజశేఖర్ పాల్గొన్నారు. పట్టణంలోని 13వ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పోస్టు ప్రసాద్, కౌన్సిలర్లు మల్లికార్జున రెడ్డి, శరత్‌కుమార్, మహేశ్వరరెడి పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన

బేతంచెర్ల: సాంకేతిక సమస్యలతో సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించి న్యాయం చేయడంతో పాటు ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ, ఐసీడీఎస్ పీడీ నిర్మల తెలిపారు. మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో సర్పంచ్ శ్రీరాములు, తవిసి కొండ సర్పంచ్ లక్ష్మీదేవి వైస్ ఎంపీపీ రంగస్వామి, ఎంపీడీఓ వెంగన్న, అంబాపురం గ్రామంలో సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలకు హాజరైన వారు ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గూని నాగరాజు, శేఖర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, బండికాటి వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, సుధాకర్, భరణి, వెంకటస్వామి, మోహన్ రెడ్డి, ఎద్దులన్న, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదతరులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: మండల కేంద్రం బనగానపల్లె సచివాలయం–4తోపాటు ఇలూరుకొత్తపేట, రామతీర్థం గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఇల్లూరు కొత్త పేట సచివాలయంలో పాల్గొన్న ఎంపీడీఓ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మండలం ఇప్పటి వరకు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా 12,475 మంది లబ్ధిదారులకు ఉచిత ధ్రువీకరణ పత్రాలను అందజేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచామని గుర్తు చేశారు. రామతీర్థం గ్రామంలో ఎంఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 870 మందికి, బనగానపల్లెలో మండల డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 900 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, సురేష్‌నాయుడు, బనగానపల్లె సర్పంచ్ ఈసారి యల్లమ్మ, ఆ ర్ఐ రాఘవేంద్రప్రసాద్, ఈఓ ఖాలీల్, పీఎస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి కొండంత అండ

వృద్ధురాలికి భోజన ప్యాకెట్ అందజేస్తున్న ఈ ఫోటోలోని వలంటీర్ పేరు మీనాకుమారి. ఎంటెక్ పూర్తి చేసి కూడా ఈ యువతి ప్రజలకు తనవంతు సేవ చేయాలన్న ఉద్దేశంతో నాలుగేళ్లుగా కోవెలకుంట్ల పట్టణంలోని ఐదవ గ్రామ సచివాలయ పరిధి ఎల్ఎం కాంపౌండ్‌లో వలంటీర్‌గా పనిచేస్తోంది. తనకు కేటాయించిన 56 కుటుంబాలకు కొండంత అండగా నిలిచి అందరి మన్ననలు పొందుతోంది. ప్రత్యేకించి కరోనా కష్ట కాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిని తీరును ఆయా కాలనీల ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ఫీవర్ సర్వే, కూరగాయలు, నిత్యావసరాల పంపిణీ, అనాథలు, వృద్ధులకు భోజన ప్యాకెట్లు అందేస్తూ అండగా నిలిచారు. కరోనాబారిన పడిన బాధితులకు మందులు, తదితర సేవలను అందించి అందరి మన్ననలు పొందారు మీనాకుమారి. – కోవెలకుంట్ల



వృద్ధురాలికి భోజన ప్యాకెట్లను అందజేస్తున వలంటీర్ మీనాకుమారి (ఫైల్)



ఆప్యాయంగా పలకరిస్తుంది

ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ వలంటీర్ మీనాకుమారి మా కుటుంబాల్లో ఒకరిగా నిలిచింది. కరోనా కాలంలో నాలాంటి ఎందరికో అన్ని రకాల సేవలను అందించింది. కరోనా సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ఆదుకుంది. ప్రతి నెలా ఒకటవ తేదీన తెల్లవారుజామునే తలుపు తట్టి ఫించన్ అందజేస్తోంది. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని ఇంటివద్దకే చేరుస్తోంది. మీనాకుమారి సాయం ఎప్పటికీ మరువు రాదు. –షేక్ ఉసేన్‌బీ, వృద్ధురాలు, కోవెలకుంట్ల

అండగా నిలిచారు....

ఈ చిత్రంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వ్యక్తి పట్టణంలోని టీఆర్ నగర్ వలంటీర్ బాలక్రిష్ణ. రూ. 5వేల గౌరవ వేతనంతో సేవే పరమావధిగా వలంటీరుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కరోనా గడ్డు పరిస్థితుల్లో బయటకు రాలేని పరిస్థితుల్లో తన పరిధిలోని కుటుంబాలకు అండగా నిలిచాడు. ప్రత్యేకించి వృద్ధులు, దివ్యాంగులకు అన్నీతానై అండగా నిలిచాడు. నిత్యావసర సరుకులు, మందులను కూడా స్వయంగా అందజేసి మనోధైర్యాన్ని కల్పించిన తీరును ఇప్పటికీ ఆయా కాలనీల ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. – డోన్



కరోనా సమయంలో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ బాలక్రిష్ణ (ఫైల్)



సేవలను మర్చిపోలేం...

వృద్ధాప్యం...అందునా కరోనా కష్టకాలంలో వలంటీర్ బాలక్రిష్ణ అండగా నిలిచాడు. అయినవారు ఎవ్వరూ పట్టించుకోకున్నా మాలాంటి వారిని వలంటీర్లు కన్నబిడ్డల్లా చూసుకున్నారు. నాకు కుమారుడు, కుమార్తె ఉన్నప్పటికీ ఇతర ప్రాంతాల్లో స్థిర పడ్డారు. కరోనా కష్టకాలంలో ప్రయాణ సౌకర్యాలు లేక పోవడంతో నన్ను చూసేందుకు కూడా రాలేక పోయారు. వలంటీర్ బాలక్రిష్ణ మాలాంటి అండగా నిలబడి చేసిన సేవలను ఎప్పటికీ మరిచిపోను.

– ఎరుకలి రామక్క, టి.ఆర్. నగర్, డోన్.

ఘనంగా శ్రీమారెమ్మ తల్లి జాతర



మారెమ్మకు సమర్పించేందుకు బోనాలతో వస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: మండలంలోని జోలాపురం గ్రామంలో శ్రీ మారెమ్మ, పోతురాజు, కుంటమ్మ తల్లి జాతరను గ్రామ పెద్దలు, రైతుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. సోమవారం అర్ధరాత్రి నుంచి శ్రీ మారెమ్మ తల్లి, పోతురాజు, కుంటమ్మలకు భక్తులు ప్రత్యేక పూజలు, బలిక్రతువును సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మ వార్లకు బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సోదరుడు కాటసాని తిరుపాల్‌రెడ్డితో పాటు జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన సంఘం అధ్యక్షులు గుండం నాగేశ్వర్‌రెడ్డి, యాగంటి ఆలయ మాజీ చైర్మన్ బుచ్చిరెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, బండి బ్రహ్మనందరెడ్డి శ్రీ మారెమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పుట్ట పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అలాగే అమ్మవారిశాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, సిమెంట్ నగర్‌లో వెలసిన సుంకులా పరమేశ్వరీ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

నేడు వేములపాడులో గడపగడపకు మన ప్రభుత్వం

అవుకు: మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తారని, ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారని వారు వివరించారు.

రీసర్వేకు వివరాలు అందజేయాలి

కోవెలకుంట్ల: భూముల రీసర్వేకు సంబంధించి రైతులు వివరాలు అందజేయాలని తహసీల్దార్ పుష్పకుమారి సూచించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని లింగాల గ్రామంలో మూడు రోజుల నుంచి రీసర్వే కొనసాగుతోందన్నారు. గ్రామానికి చెందిన కొందరు రైతులు నంద్యాల, బనగానపల్లె, కర్నూలు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న రైతులు గ్రామానికి చేరుకుని వారి భూములకు సంబంధించిన వివరాలను సర్వే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

వర్షంలోనూ తారురోడ్డు పనులు

డోన్ టౌన్ : పట్టణం నుంచి వెంకటాపురం గ్రామం వరకు నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులను నాసి రకంగా చేపడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత రెండు రోజులుగా వర్షం కురుస్తున్న తారు రోడ్డు పనులు చేపడుతుండటంతో నాణ్యతపై పలు గ్రామాల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్బీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా గుత్తేదారులు ఇష్టానుసారం రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని డీఈ ప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తారు రోడ్డు పనులు ఆపేయాలని సూచించామన్నారు.